క్లుప్తంగా

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులతో ఆదివారం రద్దీగా మారింది. పాల పొంగళ్లను పొంగించిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా సుదర్శన హోమం



పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని హోమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో మాధవీలత, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత



గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేశారు. క్లబ్ శాశ్వత సభ్యుడు అన్నేపల్లి పాండు వితరణతో 8వ వార్డుకు చెందిన వెంకట్రావు అనే దివ్యాంగునికి క్లబ్ సభ్యులు ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఫాదర్స్ డే నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. క్లబ్ కార్యదర్శి డి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు(ఎలక్ట్) ఎల్ఈ వెంకటేశ్వరరావు, సభ్యులు ఎం.రామకృష్ణ, ఎల్.చిట్టిబాబు, బి.కుటుంబరావు, కె.శ్రీవిష్ణు, వి.బ్రహ్మాజీ, అర్జా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



పమిడిముక్కల: మండలంలోని అలీనభీపాలెంలో షియా ముస్లింలు ఈదే ఘదీర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. దీంతో మసీదుల్లో కోలాహలం నెలకొంది.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



మండవల్లి: మండవల్లి శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో 15వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం బాబా వారికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటల నుంచి గురువు పరసా వీరాస్వామి పర్యవేక్షణలో నల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండవల్లి మురళీ బాలకృష్ణ సమాజంచే కోలాట ప్రదర్శన జరిగింది. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో తల్లిని కోల్పోయిన చిన్నారులకు పరామర్శ



గణపేశ్వరం(నాగాయలంక): ఇటీవల అవనిగడ్డ – కోడూరు మార్గంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన గణపేశ్వరం గ్రామానికి చెందిన చాట్రగడ్డ సువార్త కుటుంబాన్ని కృష్ణా జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్, ఇతర నాయకులు ఆదివారం పరామర్శించారు. మృతురాలి భర్త క్రీస్తురాజుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లిని కోల్పోయిన చిన్నారులకు ధైర్యంగా ఉండాలని, వారి విషయంలో సున్నితంగా ఉంటూ బాధ్యతతో పెంచాలని తల్లి లేని లోటును కుటుంబ సభ్యులే తీర్చాలని చెప్పారు. ఆయన వెంట గ్రామ పెద్దలు మంచాల బాబూవరప్రసాద్(బాబు), చాట్రగడ్డ నిర్మలరావు, మేడికొండ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

- అధిక ధరలకు విక్రయాలు
- బల్క్‌గా కూరగాయల విక్రయాలు
- నిరోధానికి చర్యలు పటిష్ట చర్యలు
- దుకాణాల ఏర్పాటుకు ముందుకురాని రైతులు



రైతుబజారు ఎంట్రన్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

సమస్యల వలయంలో రైతు బజార్

పెడన: పెడన మార్కెట్‌యార్డులోని రైతు బజారులో సమస్యలు తాండవిస్తున్నాయి. గతంలో ధరలు అధికంగా విక్రయించడంతో గొడవలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పలు సమస్యలతో లాభాలకు, నష్టాలకు మధ్య రైతు బజారు ఊగిసలాడుతోంది.

రైతులు ముందుకు రాకపోవడంతో

2018లో ఏర్పాటు చేసిన రైతుబజారులో 22 దుకాణాల సముదాయం ఏర్పాటైంది. రైతుల కంటే బయటి వారే అధికంగా ఉండటంతో ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే వాదనలు కూడా ఉన్నాయి. రైతులు ముందుకు రాకపోవడం రైతుబజారు తెరిచామనే ఉద్దేశంతో కనీసం వ్యాపారస్తుల ద్వారా అయినా విక్రయాలు జరపాలనే ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులను కాకుండా బయట వారిని పెట్టి విక్రయాలు జరుపుతూ వచ్చారు. అదే ఇప్పటి వరకు కూడా కొనసాగుతూ వస్తోంది.

ఆదరణ లేకపోవడానికి కారణాలివీ..

ప్రారంభంతో విక్రయాలు వెనుకబడి ఉండటంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్నారే ఆరోపణలు బాగా వచ్చాయి. ఊరికి చివరన నిర్మించడంతో



మరమ్మతులకు గురైన డిస్‌ప్లే బోర్డు

పెద్దగా రాబడి ఉండటం లేదంటున్నారు. తెచ్చిన సరుకును అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రైతుబజారు చుట్టూ పక్క గ్రామాలకు చెందిన కూరగాయాల దుకాణాలు వారు బల్క్‌గా తీసుకుపోతుండటం విమర్శలు వెల్లు వెత్తిన సంఘటనలు ఉన్నాయి. రెగ్యులర్ ఈవో లేకపోవడం, సిబ్బంది ఉన్నా అడపాదడపా వస్తూ పోతుండటంతో ఉన్నవారిదే రాజ్యం అన్నట్లుగా రైతుబజారు పరిస్థితి మారింది.

సిబ్బంది బదిలీతో

ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్‌ను నియమించడం, సిబ్బంది బదిలీపై వెళ్లిపోవడం జరిగింది. దీంతో సూపర్‌వైజర్ ఒక్కరే పర్యవేక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. సూపర్‌వైజర్‌కు సైతం ఆరు నెలలు కిందట ఎస్టేట్ అధికారిగా ఉద్యోగన్నతి రావడంతో బాధ్యతలు మరింత పెరిగాయి.

రైతుబజారులో 22 దుకాణాలు

ఈ బజారులో 22 దుకాణాలున్నాయి. రెండు సొసైటీలు నడుపుతుండగా మరో ఐదు దుకాణాలు డ్వాక్రా మహిళలకు కేటాయించారు. తొమ్మిది మంది బయట వారు నడుపుతున్నారు. వాటర్ ప్లాంట్‌కు ఒక దుకాణం కేటాయించారు. ఐదు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానించారు. అయితే వీటిని రైతులు ద్వారా భర్తీ చేస్తారా లేక బయట వారితో భర్తీ చేస్తారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

పర్యవేక్షణకు సీసీ కెమెరాలు

ఆయా సమస్యలను అధిగమించడానికి, సిబ్బంది లేకపోయినా పర్యవేక్షించడానికి వీలుగా రైతుబజారులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశమార్గం వద్ద అటు ఇటు రెండు కెమేరాల చొప్పున నాలుగు కెమేరాలను అమర్చారు. ఈవో కార్యాలయం వద్ద ఒకటి, చివరి పక్కన రెండు కెమేరాలు వాష్‌రూం పక్కన మరో కెమేరాను ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ కూడా విక్రయించేలా అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఆదాయం బాగానే ఉంది



కొత్తిమీరతో పాటు అల్లం, వెల్లుల్లిపాయాలు, నిమ్మకాయలు విక్రయిస్తుంటా. ఆదాయం బాగానే ఉంది. కొత్తగా వాటర్‌ప్లాంట్ మంజూరైంది. దానిని కూడా ఏర్పాటు చేస్తున్నా. వారం రోజుల్లో వాటర్ ప్లాంట్ కూడా అందుబాటులోకి వస్తుంది. మినరల్‌వాటర్ కూడా విక్రయించడానికి రైతుబజారులో అవకాశం వచ్చింది. వినియోగదారులు పెరుగుతున్నారు.

– దాసరి వీరబాబు, దుకాణాదారుడు, రైతుబజారు, బల్లిపర్రు

రైతులు ముందుకు రావడం లేదు



రైతులే స్వయంగా పంట పండించి అమ్ముకునేందుకు ఈ రైతు బజారు ఏర్పాటైంది. అయితే రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా ఉండి విక్రయించుకునేందుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రస్తుతం విక్రయిస్తున్న వారు లాభం వచ్చేలా అమ్ముకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం రైతుబజారులో ఐదు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరాం. రైతుబజారుకు దుకాణాల అద్దె నెలకు రూ.49,750 ఆదాయం వస్తోంది. వీటికి తగ్గట్టుగానే ఖర్చు కూడా ఉంది. రైతుబజారులో పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నాం.

– ఎస్‌వీఎస్ సురేష్‌కుమార్, ఎస్టేట్ అధికారి, రైతుబజారు, పెడన

'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' పుస్తకావిష్కరణ

మచిలీపట్నంటౌన్: స్థానిక కామ్రేడ్ మధుసూదన్ రావు శ్రామిక భవన్‌లో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, జిల్లా అభివృద్ధిపై సీపీఎం ముద్రించిన 'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' అనే పుస్తకాన్ని ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం నత్త నడక సాగిస్తూ ఒకటి రెండు హామీలు అమలు చేసి మిగతావి గాలికి వదిలేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ఏమో నిధులు లేవని, పెట్టుబడిదారులకు పారిశ్రామిక వాడల పేరుతో భూములు దోచిపెట్టడానికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మచిలీపట్నాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. భారత్ సాల్ట్ పరిశ్రమ మూతపడింది. ఉన్న పరిశ్రమలు మూత పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆందోళనా కార్యక్రమాలను తీవ్రతరం చేస్తాం..

జ్యూవెలరీ పార్కును విస్తరించి శిక్షణ సంస్థ ఏర్పాటు చేసి నైపుణ్యాలను మెరుగుపరుస్తామన్న హామీ నెరవేరలేదని చెప్పారు. పెడన కలంకారి పరిశ్రమను ఆదుకునేందుకు చేనేత క్లస్టర్ జాడలేదన్నారు. గుడివాడలో ప్రైవేట్ రంగంలో పరిశ్రమల ఏర్పాటు హామీలు అలానే ఉంది. కృష్ణా డెల్టా పంట కాలువలు, మేజర్ డ్రెయిన్‌ల అభివృద్ధి పనులు వర్షాలు ప్రారంభమయ్యాక మొదలుపెట్టి చేతులు దులుపుకున్నారని వివరించారు. మచిలీపట్నం– రేపల్లె రైలు మార్గం నిర్మాణం కాగితాల మీదే ఉందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుంటే రానున్న రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనా కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయణరావు, సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తెరుచుకోని రేషన్ దుకాణాలు



గొడుగుపేటలోని కోటి సెంటర్‌లో తెరుచుకోని రేషన్ దుకాణం



గొడుగుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట తెరుచుకోని రేషన్‌దుకాణం

చివరి రోజు కావడంతో ఇబ్బంది పడ్డ కార్డుదారులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను ఆదివారం డీలర్లు తెరవలేదు. 15వ తేదీ సరుకుల పంపిణీకి చివరిరోజు కావటంతో పలువురు కార్డుదారులు సరుకుల కోసం వచ్చి దుకాణాలు తెరవకపోవటంతో నిరాశతో వెనుతిరిగారు. తెరవని దుకాణాల వద్ద ఈ నెల 15వ తేదీ వరకూ నిత్యావసర సరుకులు ఇవ్వబడును అని బోర్డులు పెట్టిమరీ తెరవకపోవటాన్ని పలువురు కార్డుదారులు తప్పుపడుతున్నారు. గతంలో ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారని పనులు మానుకుని డిపోకు వస్తే వీటిని తెరవకపోవటంతో ఈ నెల సరుకులను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం దుకాణాలను తెరవని డీలర్‌లపై చర్యలు తీసుకోవాలని కార్డుదారులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రేషన్ షాపులు తెరవకపోవటంపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా 15వ తేదీ వరకు నిత్యావసర సరుకులు కార్డుదారులకు అందజేయాలి. 15వ తేదీలోపు ఆదివారాలు వచ్చినా, ఇతర సెలవు దినాలైనా రేషన్ షాపులు తెరిచే ఉంచి కార్డుదారులకు సరుకులు ఇవ్వాల్సిందే. వృద్ధులు, దివ్యాంగులకు కూడా వారి ఇంటికి వెళ్లి సరుకులు ఇవ్వాలి.

– సుభాని, పీడీఎస్ డీటీ

తోట్లవల్లూరు వ్యవసాయాధికారిణిగా శ్రీదేవి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల వ్యవసాయాధికారిణిగా గూడపాటి శ్రీదేవి నియమితులయ్యారు. పామర్రు టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ వ్యవసాయాధికారిగా పనిచేసిన జి.నాగేశ్వరరావు నందిగామకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీదేవి మండల వ్యవసాయాధికారిణిగా బాధ్యతలు చేపట్టారు.

200 మందికి రక్త పరీక్షలు



మచిలీపట్నం టౌన్: నగరంలోని వలంద పాలెం రహమానియా(అహలె హదీస్) మసీదు వద్ద ఉన్న ఈద్గా స్థలంలో ఆదివారం ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. రహమానియా మసీదు, దివ్య ల్యాబ్ రక్త పరీక్ష కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో 200 మందికి అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వలందపాలెం, మాచవరం, నీలగిరి, గంగులవారితోట, గాంధీనగర్, సర్కార్‌తోట, సుకర్లాబాద్, పరాసుపేట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రెహమానియా మసీదు అధ్యక్షుడు మహమ్మద్ దాదాసాహెబ్, వైస్ ప్రెసిడెంట్ నాగుల్ మీరా, సెక్రటరీ ఎండీ ఆబు మహమ్మద్ సిద్దిక్, దివ్య ల్యాబ్ నిర్వాహకులు రాంబాబు, సలీం అబ్దుల్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉర్వేళమ్మ జాతర

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవత ఉర్వేళమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ కుటుంబ సమేతంగా పోతురాజుస్వామి చెట్టుకు పూజలు చేసి, ఆలయంలోని ఉర్వేళమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, పసుపు కుంకుమ సమర్పించారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముఠా పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గరికపాటి శివశంకర్, సింహాద్రి పవన్, మండలి నరేష్, సందు పవన్, నల్లగోపుల చలపతి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



పోతరాజు స్వామికి పూజలు చేస్తున్న రాజేష్ తదితరులు

50 వేల మొక్కల పంపిణీకి ఏర్పాట్లు

మచిలీపట్నంటౌన్: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మణస్వామి (చిన్నాపురం డాక్టర్) వితరణతో జూలై 13న నగర ప్రజలకు 50 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ భాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని హిందూ కాలేజీ ఎదురుగా ఉన్న స్థలంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 16వ తేదీ సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనక ఉన్న సహాయ సేవా క్యాంటీన్ వద్ద, 17, 18 తేదీల్లో లక్ష్మి టాకీస్ సెంటర్ సమీపంలోని డీ మార్ట్ రోడ్‌లో సాయికృష్ణ హోటల్ పక్కన స్థలంలో ఏ మొక్క కావాలో వాటికి సంబంధించిన స్లిప్‌లను ఇస్తామన్నారు. కావలసిన మొక్కల స్లిప్‌ను తీసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు స్లిప్‌లను అందజేస్తామని చెప్పారు.

గ్రామ సభలు ప్రారంభం



మోపిదేవి: 2024– 25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. మండలంలో ఉదయం బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, వెంకటాపురం, కోసూరువారిపాలెంలో, సాయంత్రం మోపిదేవి, పెదప్రోలు గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో గతేడాదిలో జరిగిన పనులను డీఆర్‌పీ బృందాలు చేపట్టిన తనిఖీలలో వచ్చిన అభియోగాలు, సమస్యలను గ్రామ సభలో చదివి వినిపించారు. అనంతరం టీపీ హరిబాబు నాయక్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, తుమ్మా సోములమ్మ, కోసూరు అనూష, నందిగం మేరీరాణి, పాలిమెట్ల ఏసుబాబు, ఎంపీటీసీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన



ధర్నా చేస్తున్న స్థానికులు, నాయకులు

గుడివాడటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్థానిక నైజాంపేటలో ఈ మేరకు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది వచ్చి మీటర్లు మారుస్తున్నారన్నారు. దీని వలన అనేక నష్టాలు వస్తాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మీటర్లను తొలగించాలని చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసే స్మార్ట్ మీటర్లను తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఆర్సీపీ రెడ్డి, పి.రజిని, ఆర్.కొండ, సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మీగడ' మృతికి డీఎన్నార్ నివాళి



మీగడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: మండలంలోని చిగురుకోటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మీగడ వెంకటేశ్వరరావుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆదివారం నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు ఇటీవల మరణించగా సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, కలిదిండి ఏఎంసీ మాజీ చైర్మన్ నీలిపాల వెంకటేశ్వరరావు, మీగడ సత్యనారాయణ, సానబోయిన సత్యనారాయణ, బోయిన సత్యనారాయణ, నీలపాల సుబ్బయ్య, సహదేవుడు, రాంబాబు, గొల్లబాబు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టండి



ఎంపీడీవో అరుణకుమారి

పెడన: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని, ఎక్కడ కూడా చెత్త నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీవో ఎ.అరుణకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఆదివారం పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాలు పడుతున్న తరుణంలో వర్షం నీరు నిల్వలేకుండా చూడాలని, తాగునీటి బావుల వద్ద క్లోరినేషన్ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేకునేలా చైతన్యం చేయాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని డయేరియా వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాలని స్పష్టం చేశారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



పామర్రులో ఫాదర్స్‌ను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

పామర్రు: స్థానిక కొండిపర్రు రోడ్డులోని చైతన్య ఆగ్రో ఇండస్ట్రీ మిల్ ఆవరణలో పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ తండ్రి మనస్సు సముద్రం కన్నా విశాలమైనదన్నారు. హిమాలయ పర్వతాల కన్నా దృఢమైనదని, భగవంతునిచే అందించిన గొప్ప వ్యక్తి తండ్రిని కొనియాడారు. కుటుంబ బరువు బాధ్యతలను తమపై వేసుకుని కష్ట,నష్టాలను ఓర్చి కుటుంబాన్ని సాకే వాడే తండ్రి అని అన్నారు. అనంతరం కూనపరెడ్డి వెంకట ధర్మారావు, పాటిబండ రాంబాబులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జమీదగ్గుమిల్లి గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు, కళాపీఠం సభ్యుడు తోట రమేష్, కనుమూరు మోడల్ స్కూల్ హెచ్ఎం నరేంద్ర మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో వైభవంగా అంకమ్మ తల్లి సంబరం



సంబరాల్లో పాల్గొన్న తాతినేని వంశీకులు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వలో తాతినేని వంశీయుల ఇలవేల్పు శ్రీఅంకమ్మ తల్లి నెల సంబరాన్ని ఆదివారం డప్పు వాయిద్యాల అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సంబరానికి ఆ వంశానికి చెందిన కుటుంబాలు సామూహికంగా గ్రామంలో పోతురాజు గడతో అమ్మవారి ఘటంతో ఊరేగింపు నిర్వహించి దేవాలయం వద్ద మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భద్రపరిచిన పెట్టెతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం అమ్మవారిని దేవాలయంలోకి ప్రవేశపెట్టారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో సంబరాలు

పెడన: మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గ్రామ దేవతల సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహంకాళమ్మ తల్లి, గంగానమ్మతల్లి, అంకమ్మ తల్లి, పోతురాజు సంబరాల మహోత్సవాలను ఈ నెల 11వ తేదీన ప్రారంభించారు. 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆదివారం ఐదో రోజు కావడంతో కనకదుర్గమ్మ అమ్మవారి వనవాసాలు, రాత్రికి అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. సోమవారం పోతురాజు స్వామికి సలివిడి, పానకం, వడపప్పులను సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారని ఆలయ కమిటీ వారు తెలిపారు.

శస్త్రచికిత్సలకు 155 మంది ఎంపిక



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ వందన, ధృవ, పక్కన ప్రతినిధులు

నాగాయలంక: స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుదర్శి మానవతా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని)సహకారంతో ఎస్ఆర్‌వి బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో ఈ సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ఆధ్వర్యంలో 53వ ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. సంస్థ అందిస్తున్న సేవలను పలువురు వక్తలు కొనియాడారు. దాతల ఆర్థిక భరోసాతో ఇప్పటికి 53 శిబిరాలు జరిపి 6 వేల మందికి పైగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో 187 మందికి డాక్టర్ వందన, డాక్టర్ ధృవ కంటి పరీక్షలు జరిపి వీరిలో 155 మందిని ఐఓఎల్ ఆపరేషన్(కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్రచికిత్సకు ప్రత్యేక బస్సుల్లో శంకర కంటి ఆస్పత్రికి పంపించారు. కనిగంటి వెంకట నారాయణ, ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి రవి, మత్తి శివ, కనిగంటి అజయ్ రోగులకు సేవలు అందించారు.

మేము సైతం బృందం సాయం

ముదినేపల్లిరూరల్: ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన గోన మాధవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. సమాచారం తెలుసుకున్న మేము సైతం బృంద సభ్యులు మాధవి కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, ఆర్థిక సాయాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, దాసరి కృపారావు సాయమందించి మాధవికి నిత్యావసర సరుకులు అందజేశారు. మేము సైతం బృందం సభ్యులు పాల్గొన్నారు.